క్లుప్తంగా

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని కాలేజీరోడ్డులోని డిస్ట్రిబ్యూషన్ మెయిన్ పైపులైన్ పగిలి పోవడం వల్ల ఈ నెల 7వ తేదీ ఆదివారం తాగునీటి సరఫరాకు అంతరా యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19, 20, 32 వార్డుల్లో మంచినీటి సరఫరా జరగదని, ప్రజలు గమనించాలని కోరారు.

ఉపయోగంలోకి నీటితొట్టీలు



నీటి తొట్టిలో నీరు నింపుతున్న కార్యదర్శి

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: ఈ నెల 4న 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన 'నిరుపయోగంగా నీటి తొట్టీలు' అనే కథనానికి ఎంపీడీవో రాజేశ్వర్ స్పందించారు. ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానాతో కలిసి శనివారం నీటి తొట్టీలను పరిశీలించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. శంకర్‌పల్లి జీపీ పరిధిలోని సండ్రోన్‌పల్లి సమీపంలోని నీటి తొట్టిని శుభ్రం చేసి నీరు నింపాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. సారంగపల్లిలోని కూల్చివేతకు గురైన నీటి తొట్టి వద్దకు వెళ్లి ఆరా తీశారు. ఎవరైతే నీటి తొట్టిని కూల్చివేశారో వారితో మాట్లాడి రోడ్డుకు దగ్గరగా నీటి తొట్టిని నిర్మించి గ్రామ పంచాయతీకి ఇవ్వాలని ఆదేశించారు. నీటి తొట్టీల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సారంగపల్లి, శంకర్‌పల్లి గ్రామ పంచాయతీల కార్యదర్శులకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

గుంతలు పూడ్చిన పోలీసులు



గుంతలు పూడ్చివేయిస్తున్న పోలీసులు

భీమిని: మండలంలోని రాంపూర్ క్రాస్‌రోడ్డు నుంచి టేకులపల్లి పెట్రోల్‌బంక్ వరకు ఉన్న రోడ్డుపై గుంతలను శనివారం భీమిని ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పూడ్చారు. సుమారు 3 కిలోమీటర్ల దారిపై గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో పోలీసుల చొరవతో సుమారు 60ట్రిప్పుల మొరాన్ని గుంతల్లో పోసి చదును చేయించారు. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. స్థానిక ప్రజలు, వాహనదారులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీచైతన్య పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో చదివే అన్ని తరగతుల విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో వారికి పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోబిన్, పీఈటీలు రాజేందర్, ఏవో విలాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లిలో శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించా రు. కార్యక్రమంలో సీఈవో లక్ష్మణ్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జి రామన్న, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్



మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఐదో వార్డు మోమిన్‌పుర మసీదులో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ముస్లింలకు ఏర్పాటు చేశారు.

ఇల్లు.. ధగధగ..!

- ఆకర్షణీయమైన రంగుల బల్బులపై ప్రత్యేక దృష్టి
- కాంతులీనుతున్న ఎలివేషన్ లైటింగ్
- ఖర్చుకు వెనుకాడని కస్టమర్లు

సండే స్పెషల్





మంచిర్యాల జిల్లా కేంద్రంలో అవుట్ డోర్ లైటింగ్‌లో ఇళ్లు

మంచిర్యాలఅర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఇల్లు అందంగా కనిపించటం కోసం అలంకరణపై దృష్టిసారిస్తున్నారు. ఇంటికి రంగులు ఎంత అవసరమో..? లైటింగ్ డిజైన్‌పాత్ర చెప్పరానిది. ప్రస్తుతం ఇంటి వెలుపల (బయట) ఆధునిక శైలిలో ఆకర్షణీయమైన గోడ దీపాల వరకు ఇంటికి సొబగులు తీర్చిదిద్దుతున్నారు. ఖర్చుకు వెనకాడకుండా ఇంటి ముందు భాగంలో ఎలివేషన్ లైటింగ్‌లు కాంతులీనుతున్నాయి. నలుగురిలో ప్రత్యేకంగా ఉండటానికి ప్రకాశవంతమైన ఎల్‌ఈడీ లైటింగ్‌ను అమర్చుతున్నారు. ఇల్లు చూడగానే ఆహ్వానించదగిన వాతావరణంలో స్టైలిష్‌గా ఎలివేషన్ లైటింగ్‌లపై ప్రత్యేక కథనం..

లైటింగ్ డిజైన్‌లో..

ప్రహరీ, పై కప్పులపై లైటింగ్ పాత్ర ప్రకాశం కంటే చాలా ఎక్కువ. ఇంటీరియల్ లైటింగ్‌కు ఎంత ముఖ్యమో..? అంతకంటే ఇంట్లోకి అడుగుపెట్టే ముందు ఎలివేషన్ లైటింగ్‌లు (అవుట్‌డోర్ లైటింగ్) అంతే కీలకంగా మారాయి. గేట్ దగ్గర ఇరువైపులా మాత్రమే విద్యుత్ బల్బులు ఉండేవి. ప్రస్తుతం గోడ నుంచి ప్రహరీ వరకు విద్యుత్ బల్బులు అమర్చుతున్నారు. వన్‌వే, టువే, త్రీవే, ఫోర్‌వే, గార్డెన్ లైట్, స్పాట్ లైట్‌లను మల్టీకలర్, గోల్డ్ కలర్లు అందుబాటులోకి వచ్చాయి. రూ.450 నుంచి రూ.1500వరకు ఎల్ఈడీ లైట్లు లభిస్తున్నాయి.



ప్రహరీకి నాలుగువైపులా లైటింగ్



వివిధ రకాల గోడ లైట్లు

వెరైటీగా ఉండాలని..



పగలంతా ఇంటికి ఉన్న రంగులు కనిపిస్తాయి. రాత్రి వేళల్లో కూడా ఇంటి ముందు భాగంలో గోడల నుంచి పైకప్పు వరకు ఆకర్షణీయంగా ఉండటానికి లైటింగ్ ఏర్పాటు చేసుకున్నాం. అందరికంటే భిన్నంగా ఉండాలనే ఉద్దేశంతో నాలుగు దిక్కుల లైటింగ్ నుంచి ప్రహరీ వరకు విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేశాను. ఇల్లును చూడగానే ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంది. – శివ, ఇంటి యజమాని

అవుట్‌డోర్ లైటింగ్‌కు డిమాండ్..

ఇల్లు అలంకరణలో ఇంటీరియల్ మాదిరిగానే అవుట్ డోర్ లైటింగ్‌కు డిమాండ్ పెరుగుతుంది. గతంలో రూ.3000కు పైగా ధరలుండేవి. ప్రస్తుతం మోడల్‌ను బట్టీ రూ.450 నుంచి ధరలో లైటింగ్ అందుబాటులో ఉన్నాయి. 90శాతం ఇప్పుడు అవుట్‌డోర్ లైటింగ్ అంటే సర్ఫేస్‌లైట్, ప్రహరీ లైట్, గార్డెన్ లైట్‌లు కొనుగోలు చేస్తున్నారు. ధరలు తక్కువగా ఉండటం.. ఎల్ఈడీ బల్బులవైపు కస్టమర్లు చూస్తున్నారు. – పల్లెర్ల సంతోష్, షాపు నిర్వహకుడు

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

తాండూర్: అసాంఘిక శక్తులతో అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి ఆశ్రయం కల్పించవద్దని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన మాదారం నుంచి బెజ్జాల వరకు గల కల్వర్టులను శనివారం సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం బెజ్జాల గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాదారం ఎస్సై అనూష, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బెజ్జాలలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ

పన్ను రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇంటి పన్నులను ప్రతి ఒక్కరూ చెల్లించాలని, గత ఏడాది పన్ను మొత్తం చెల్లించిన వారికి ఈ ఏడాది పన్నును ముందస్తుగా చెల్లిస్తే ప్రభుత్వం 5శాతం రాయితీని అందిస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. ఎర్లీబర్డ్ స్కీం కింద ఉషోదయ విద్యాసంస్థల అధినేత యార్లగడ్డ బాలాజీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను రూ.1.80లక్షలను శనివారం మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో చెల్లించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ శంకర్ పాల్గొన్నారు.



పన్ను చెల్లింపులను తీసుకుంటున్న ఉప్పలయ్య

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు

చెన్నూర్: పట్టణంలో మర్వాడీ కుల మహిళలు గన్‌ఘోర్ (శివపార్వతుల) ఊరేగింపు వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక మహేశ్వరి భవన్‌లో హోలీ పండుగ నుంచి 17రోజుల పాటు శివ పార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం కల్యాణం నిర్వహించారు. అనంతరం మహేశ్వరి భవన్ నుంచి పట్టణ ప్రధాన వీధులలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేంగించారు. ఉగాది పండగ తర్వాత వచ్చే గురువారం ఉత్సవాలు ముగుస్తాయని మహిళలు తెలిపారు. కార్యక్రమంలో మర్వాడీ మహిళలు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న మార్వాడీ మహిళలు

కల్వర్టుల తనిఖీ

దండేపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్, సీఆర్పీఎఫ్ ఎస్సై అభయ్‌శర్మ ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలో రహదారుల వెంట గల కల్వర్టులను శనివారం తనిఖీ చేశారు. తానిమడుగు, కుందేల్‌పహాడ్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కల్వర్టులు తనిఖీ చేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

జన్నారం: లక్ష్యాన్ని నిర్ణయించుకుని ఉన్నతమైన లక్ష్యాలకు చేరుకోవాలని జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రాఘవేంద్ర లిటిల్‌హాన్స్ పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక మనిషిని ఉన్నతమైన స్థానంలో ఉంచేది చదువేనని, కష్టమైన ఇష్టపడి చదువుకుని మంచి భవిష్యత్‌కు పునాది వేయాలని సూచించారు. పదో తరగతి కాగానే ఇంటర్, పై చదువుల్లో క్రమశిక్షణ ను మరువకుండా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. చెడు అలవాట్లకు లోను కావొద్దని మంచివారి స్నేహం మంచి నడవడిక నేర్పిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కరిమల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఇన్‌చార్జి డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

డిగ్రీ కళాశాలలో సైబర్‌క్రైంపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక సీవీరామన్ డిగ్రీ కళాశాలలో శనివారం సైబర్‌క్రైంపై అవగాహన కల్పించారు. పట్టణ సీఐ భన్సీలాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు జాగ్రత్తలు వివరించారు. ఫుడ్‌సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులు 40రకాల వంటకాలు తయారు చేసి ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, ఏవో రమణ, రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

తిరుగు లేని శక్తిగా బీజేపీ

- ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం
- పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


భీమారం/భీమిని/జన్నారం/తాండూర్/చెన్నూర్ రూరల్/చెన్నూర్/శ్రీరాంపూర్/కాసిపేట/బెల్లంపల్లి: భారతీయ జనతా పార్టీ తన 44 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో తిరుగులేని శక్తిగా ఆవిర్భవించిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. భారతదేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. టిఫిన్ బైటెక్ కార్యక్రమాన్ని చేపట్టారు. చెన్నూర్, బెల్లంపల్లిలో టిఫిన్లను కొందరు ఇంటి నుంచి కాకుండా హోటల్ నుంచి పార్శిల్ తెప్పించుకొని తిన్నారు. వాస్తవానికి ప్రతి ఒక్కరూ కూడా ఇంట్లో తయారు చేసిన టిఫిన్ తెచ్చుకోవాల్సి ఉండగా కొందరు అదేమీ పాటించక పోవడం చర్చనీయాంశంగా మారింది. జన్నారంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో తాండూర్‌లో మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, భీమిని మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, చెన్నూర్‌లో పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోర్ల శంకర్, శ్రీరాంపూర్‌లో పార్టీ ఇన్‌చార్జి బొలిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు సత్రం రమేష్, భీమారంలో మండల బీజేపీ ఇన్‌చార్జి ఆలం బాపు, మండల పార్టీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, కాసిపేటలో మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, మండల ఇన్‌చార్జి కేశవరెడ్డి, బెల్లంపల్లిలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకట కృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: జెండావిష్కరణ చేస్తున్న కళ్యాణి

స్పోర్ట్స్ డే వేడుకలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. వార్షిక క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలి

- బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి: ఎండ తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ ఆదేశించారు. తన చాంబర్‌లో డివిజన్‌పరిధిలోని ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ తరఫున ఏర్పాటు చేసిన బోర్లు ఎండిపోతే రైతుల వ్యవసాయ బోర్ల నుంచి తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమైన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ప్రారంభించాలని, నియోజకవర్గంలోని గ్రామాలను కలుపుకుని 60వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లోనూ చలివేంద్రాలను అన్ని శాఖలు ప్రారంభించాలని సూచించారు.



బెల్లంపల్లి: మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ



జన్నారం: మాట్లాడుతున్న దత్తారాం

నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త పడాలి

జన్నారం: వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందునా మండలంలో నీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, ఏపీడీ దత్తారాం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ నీటి సమస్య ఉన్న ప్రాంతాల వివరాలు నమోదు చేసుకోవాలని, నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. తగిన ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో రమేశ్, ఏపీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలి

మందమర్రిరూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో గ్రామ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. నీటి సరఫరా కోసం యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా మిషన్ భగీరథలో ఏమైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్య తీవ్రంగా ఉంటే ప్రత్యామ్నాయంగా అగ్రికల్చర్ బోర్‌వెల్స్‌ను వినియోగించుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. చాటింపు వేసి అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో భీరయ్య, కార్యదర్శులు ఉన్నారు.

చెన్నూర్‌లో రక్తదాన శిబిరం

చెన్నూర్: స్థానిక ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు, ఆల్ ఇండియా అల్లు అర్జున్ ఫ్యాన్స్, విద్యుత్ ఉద్యోగులు మంజులసత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 52మంది యువకులు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ, వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌లకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, అల్లుఅర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్, నాయకులు అభి, హరి, శ్రావణ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



నస్పూర్: నేటి సమాజంలో విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీసీసీ నస్పూర్ ఎస్సై జితేందర్‌సింగ్ అన్నారు. పట్టణంలోని తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఆయన కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామన్న, పోలీసు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన వెంకట్రావ్

బెల్లంపల్లి: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఎమ్మెల్యే వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సూరిబాబుతో కలిసి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వినోద్‌ను శాలువాతో సన్మానించారు.

తుక్కుగూడ సభకు తరలిన నాయకులు

భీమారం/మందమర్రిరూరల్/దండేపల్లి: హైదరాబాద్ తుక్కుగూడలో శనివారం నిర్వహించిన బహిరంగ సభకు దండేపల్లి, మందమర్రి, భీమారం మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో దండేపల్లి నుంచి ఆర్.జీ.పీ.ఆర్.ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, ఎంపీటీసీ రాజన్న, నాయకులు వెంగల్‌రావ్, రాజన్న, శ్రీనివాస్, రాకేష్, మందమర్రి నుంచి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, మండలాధ్యక్షుడు నీలయ్యనాయక్ తదితరులు ఉన్నారు.

మండల సమావేశం వాయిదా

జన్నారం: మండల సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో శనివారం వాయిదా పడింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా అధికారులు తప్పా, సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. ఎంపీపీ సరోజన కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో 12 గంటల అనంతరం సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. తదుపరి సమావేశం తేదీ త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

భైరాన్‌పల్లి సినిమాను ఆదరించండి

నస్పూర్: తెలంగాణలోని జిల్లాలైన మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ కళాకారులతో తీసిన భైరాన్‌పల్లి సినిమా మార్చి 28న రిలీజ్ అయ్యిందని, సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని సినీ నిర్మాత నరేష్ వర్మ విజ్ఞప్తి చేశారు. కళాకారులతో కలిసి శనివారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో భైరాన్‌పల్లి సినిమా పోస్టర్లను కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. కళాకారులు గురుమూర్తి, దామెర రాజేశ్, గజెల్లి రాజలింగు, సందేశ్, రహీమ్, తదితరులు పాల్గొన్నారు.